ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
సోమవారం 1 జనవరి 2024 5



'కొంగొత్త' ఆనందం

2023కు వీడ్కోలు.. నూతన సంవత్సరానికి స్వాగతం

- జిల్లా వ్యాప్తంగా యువత హుషారు
- రంగులు, కేక్‌లకు భలే గిరాకీ
- గప్‌చుప్‌గా బృందాలుగా పార్టీలు

మహబూబాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : స్వరాష్ట్రంలో దశాబ్దకాలానంతరం కొత్త సర్కార్ కొలువుదీరిన తొలి కొత్త సంవత్సరం కొంగొత్త ఆనందాన్ని కొందరికి పంచుతుంటే... గడిచిన ఏడాది మరెందరికో.. తీయని జ్ఞాపకాలతో చేదు అనుభవంగా వీడ్కోలు పలికింది. ఎన్నో సంతోషాలు... మరెన్నో వినోదాలు... కొన్ని దుఃఖాలు... మరికొన్ని వచ్చి వెళ్లిన విషాదాలు... కొందరికి కొత్త రాజకీయ అందలాలు, మరికొందరికి ఓటమి చేదు అనుభవాలు వెరసి మహబూబాబాద్ 2023 సంవత్సరానికి బై..బై చెబుతూ.. 2024 నూతనవత్సరానికి జిల్లా ప్రజానీకం స్వాగతం పలికింది. గడిచిన సంవత్సరపు చివరాంకంలో రాజకీయంగా జిల్లా రూపురేఖలు మారిపోయి కాంగ్రెస్‌కు పట్టం కట్టిన నేపథ్యంలో ఇక ఈ కొత్త సంవత్సరం ఆ పార్టీ వార్డు స్థాయి నాయకులు మొదలుకుని గ్రామ, మండలాలతో పాటు పార్లమెంట్ స్థాయి నేతల వరకు తమకు అంతా మంచే జరగాలని ఆశపడుతున్నారు. అన్ని కలిసి వస్తే తమకు పదవి యోగం లభిస్తుందని విశ్వసిస్తున్నారు. ఇప్పటికే అన్ని పార్టీల ఔత్సాహికులు తమ తమ ఫాలోవర్స్, లీడర్స్‌తో నూతన సంవత్సర విందులు, వినోదాలతో ఆనందంగా గడిపారు. ఎక్కడికక్కడే బృందాలుగా విడిపోయినా యువకులు ముందుగానే తమకు అనుకూలమైన క్యాంపులకు చేరుకున్నారు. రాత్రి తెల్లవారుజాము వరకు నయా సాల్... నయా జోష్ అంటూ మునిగి తేలారు. 2019 కొవిడ్ మిగిల్చిన విషాదాల నుంచి మూడేళ్ల పాటు కోలుకున్న జిల్లా ప్రజలకు మళ్లీ వేరియంట్ రూపంలో క్రమంగా విస్తరిస్తున్న కొవిడ్ పట్ల ముందు జాగ్రత్తలు తీసుకుంటూ మాస్కులను ధరించారు. ఈ మహమ్మారి మరే ఇంటిలో విషాదం మిగిల్చకుండా చూడాలని దేవుళ్లను వేడుకుంటున్నారు.

ఎక్కడికక్కడే... అంతా నయా జోష్...

అర్ధరాత్రి 12 దాటాక ఆరంభమయ్యే 2024 కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ... పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్పే క్షణాలు గమ్మత్తు'గా గడుపుతూ... పలు బృందాలు నయా జోష్‌లో మునిగి తేలాయి. ప్రతి ఏడాది లాగే రాత్రివేళ తమ హితులు, సన్నిహితులు, బంధుమిత్రులతో పాత సంవత్సరానికి వీడ్కోలు పలికే సమయంలో అంతా ఒకచోట ఉండేలా బృందాలుగా విడిపోయి పార్టీల్లో మునిగి తేలారు. కొన్ని బృందాలైతే తలా కొంత పైకం వేసుకుని రాత్రికి మందు, విందుకయ్యే ఖర్చును సిద్ధం చేసుకుని జిల్లాలోని అతి ముఖ్యమైన ప్రాంతాల్లోని తోటల్లో సన్నిహితులతో గడిపేందుకు వెళ్లిపోయారు. ఇక రాత్రి పార్టీలు అంటే ఇష్టపడని ఆధ్యాత్మిక చింతన కలిగిన వారు మాత్రం కొత్త సంవత్సరం నుంచి తమకు అంతా శుభమే కలగాలని చర్చిలు, ఆలయాలు, దర్గాలు సందర్శించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దీనికి తోడు అన్ని వర్గాల ప్రజలు కొత్త సంవత్సరంలో స్వీట్ల పంపిణీ, కేకుల కొనుగోలు కోసం ఎగబడ్డారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు మహిళలు సంక్రాంతి వచ్చిందా.. అన్న భ్రమ కలిగేలా లోగిళ్లలో రంగు రంగుల ముగ్గులు వేయడానికి ఉత్సాహం చూపారు. మొత్తానికి జిల్లాలో నయా జోష్‌తో



పట్టణంలో రంగులను కొనుగోలు చేస్తున్న ప్రజలు



పట్టణంలోని బేకరీలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కేక్‌లు

అంతా బిజీ..బిజీ అయిపోయారు. జిల్లా కేంద్రంలోనే కాకుండా మండల కేంద్రాల్లో కూడా ఒకరోజు ముందే పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ... కొత్త సంవత్సరాన్ని స్వాగతించే ముగ్గులను వేయడానికి రంగుల దుకాణాలు కళకళలాడుతూ కనిపిస్తున్నాయి. న్యూ ఇయర్ గ్రీటింగ్స్ దుకాణాలు వెలిశాయి.

మటన్, చికెన్, చేపలకు యమ గిరాకీ..

ప్రతినిత్యం పండుగలకు.... పబ్బాలకు... ప్రత్యేకంగా వండుకునే మటన్, చికెన్, చేపలకు కొత్త సంవత్సరం యమ గిరాకీ తెచ్చిపెట్టింది. కొందరు వీకెండ్ తెచ్చుకునే నాన్‌వెజ్‌ను కొత్త సంవత్సరం పేరిట స్పెషల్ ఆర్డర్‌లతో దాబాలు, హోటళ్లకు క్యూ కట్టారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోనైతే మరి యువత రద్దీ కన్పించింది. రోజు ఇంట్లో తినేదే కదా.. కాస్త వెరైటీ ఉండాలని కాబోలు... జంకుఫుడ్... ఫాస్ట్‌ఫుడ్‌తో జిహ్వారుచులను నెమరువేసుకున్నారు. వీటికి కాస్త డ్రింక్స్ యాడ్ చేసి మత్తులోనూ... మునిగి తేలారు. ఈ సారి కొత్త సంవత్సరం కలిసి వచ్చిన వీకెండ్ తరహాలో ఆదివారం పాత వత్సరానికి వీడ్కోలు.. పలికే అవకాశం రావడంతో ఇక ఇంటిల్లి పాదికి నాన్‌వెజ్ వంటకాల రుచి తప్పలేదు. దీంతో చివరి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు చికెన్, మటన్ షాపులతో పాటు చేపల మార్కెట్‌లో సందడి కన్పించింది. విక్రయాలు కూడా సాధారణ రోజుల కంటే ఎక్కువగా పెరిగాయి.

అర్ధరాత్రి 12 వరకు వైన్స్... ఒంటిగంట వరకు బార్‌లు...

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా పాత సంవత్సరానికి బై.. బై చెబుతూ.. కొత్త సంవత్సరానికి స్వాగతించేందుకు మద్యం ప్రియులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. సాధారణ రోజుల్లో రాత్రి 10 గంటల వరకే అనుమతి ఉన్న వైన్స్ షాపులకు డిసెంబరు 31న అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్‌లకు మరో గంట అదనంగా అంటే ఒంటిగంట వరకు షాపు నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో మద్యంప్రియులకు ఊరట లభించింది. అర్ధరాత్రి వరకు వైన్స్, బార్ రెస్టారెంట్లలో విక్రయాలు జరిగాయి. ఇదిలా ఉండగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. మద్యం సేవించి అతివేగంగా వాహనాలను నడపవద్దని పోలీసులు హెచ్చరించారు.

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : కలెక్టర్



మహబూబాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ప్రజలకు కలెక్టర్ శశాంక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, చేపట్టిన పనులన్నీ నిర్విఘ్నంగా, విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

వీరభద్రుడి సన్నిధిలో ఎంపీ కవిత



వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ మాలోతు కవిత

కురవి, డిసెంబరు 31: కురవి శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో ఎంపీ మాలోతు కవిత ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరభద్రస్వామి, భద్రకాళి ఆలయాల్లో మొక్కులు తీర్చుకున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి రంగారావు, ఎంపీపీ గుగులోతు పద్మావతిరవినాయక్, మండల పార్టీ అధ్యక్షులు తోట లాలయ్య, ముత్యం వెంకన్న, ఎంపీటీసీ చిన్నం భాస్కర్, గార్లపాటి భరద్వాజ్‌రెడ్డి, బాదావత్ రాజునాయక్, యానాల గంగాధర్‌రెడ్డి, కొంతం విజయ్, బండి దీపక్‌గౌడ్, నూతక్కి నర్సింహారావు, వినోద్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలు కోసమే ప్రజా పాలన

- కాళేశ్వరం కట్టడానికి లక్ష కోట్లు.. నీరందింది 98వేల ఎకరాలకే
- పదేళ్లలో కోటి 30 లక్షల కోట్లు అప్పు చేసిన ప్రధాని మోదీ
- ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న బెల్లయ్యనాయక్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 31: తెలంగాణలో ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనకు శ్రీకారం చుట్టిందని ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన అరగంటలోనే ప్రగతి భవన్ కంచెలను తొలగించారని, ఇది ప్రజాస్వామ్య పాలనకు నిదర్శనమని తెలిపారు. సామాన్యుడు ఇటు ప్రగతి భవన్‌కు అటు సచివాలయానికి వెళ్లి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నారని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీలను ఎలా అమలు చేస్తారని మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, జగదీష్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో 5వేల పాఠశాలలను మూతవేసిన మాజీ సీఎం కేసీఆర్ పేదలను విద్యకు దూరం చేశారని విమర్శించారు. లక్ష కోట్లు పెట్టి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో కేవలం 98వేల ఎకరాలకు సాగునీరందించిన చరిత్ర బీఆర్ఎస్ సర్కార్‌దని ఎద్దేవా చేశారు. అప్పుడే ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయాయంటే నాణ్యత లోపం, అందులో అవినీతి ఎంత జరిగిందో అర్థమవుతుందన్నారు.

పదేళ్లలో కోటి 30 లక్షల కోట్లు అప్పు చేసిన మోదీ..

గతంలో దేశాన్ని పాలించిన ప్రధానులంతా రూ.50లక్షల కోట్ల అప్పులు తీసుకువస్తే పదేళ్ల కాలంలో ఒక్క ప్రధాని మోదీ మాత్రం కోటి 30లక్షల కోట్ల అప్పులు చేశారని బెల్లయ్య నాయక్ ఆరోపించారు. యూపీఏ ప్రభుత్వం ఉన్న సమయంలో లీటర్ డీజిల్ ధర రూ.59, పెట్రోల్ ధర రూ.71 ఉంటే ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వంలో డీజిల్ ధర రూ.100, పెట్రోల్ రూ.110కు చేరుకుందని మండి పడ్డారు. ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అన్ని సమస్యలు పరిష్కారం కావాలంటే రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని, అందుకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 17 స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్, తిప్పర్తి శ్రీధర్, ఆరెందుల వెంకటేశ్వర్లు, బోడ రవినాయక్, దండెబోయిన బుజ్జివెంకన్న, బండి వెంకన్న, చెన్న సీతారాములు, ఐలయ్య, మేకల శివ, దేవ్‌సింగ్, రాంచంద్రు పాల్గొన్నారు.

అయోధ్య సీతారాముల అక్షింతల శోభాయాత్ర

మానుకోట రామాలయంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్



మహబూబాబాద్ రామాలయంలో అయోధ్య సీతారాముల అక్షింతల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 31 : మహబూబాబాద్‌లోని రామాలయంలో అయోధ్య సీతారాముల అక్షింతల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్-ఉమ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్షింతల శోభాయాత్ర చేపట్టి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో ఊరేగింపు చేశారు. పట్టణంలోని వార్డుల్లో ప్రజలకు అక్షింతలు పంపిణీ చేసేందుకు సంబంధిత నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, శ్రీరంగం మురళి, వద్దిరాజు రాంచందర్‌రావు, యాప సీతయ్య, ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, మాలె యోగీశ్వర్‌రావు, ఇందుభారతి, సోమ రాంబాబు, రాణా శంకర్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

- తొర్రూరు: అయోధ్యలోని రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాటులో భాగంగా అయోధ్య నుంచి సీతారామచంద్రుల వద్ద పూజించిన అక్షింతలు, కలశాలు, ఫొటోలను ఆదివారం విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో తొర్రూరు పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం నుంచి పుర వీధులలో శోభాయాత్ర నిర్వహించారు. రామనామ భజనలతో రామమయం నినాదాలతో భక్తులు అధిక సంఖ్యలో శోభాయాత్ర చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ జనవరి 1 నుంచి మండలంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోని వివిధ వార్డుల్లో ఈ అక్షింతలు, కలశాలు అందజేయడం జరుగుతుందని, ప్రతీ ఒక్కరు భక్తిశ్రద్ధలతో స్వీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు డాక్టర్ కె.రాజేందర్‌రెడ్డి, గీత, లక్ష్మీనర్సింహారావు, ఇమ్మడి రాంబాబు, కృష్ణమూర్తి, విశ్వేశ్వరరావు, సత్యానారాయణ, సురేష్, సోమయ్య పాల్గొన్నారు.

సోమనాథ సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

- తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు
- పాలకుర్తిలో పురస్కారాల ప్రదానోత్సవం



పాలకుర్తిలో పురస్కారాలు అందుకున్న సాహితీ వేత్తలు

పాలకుర్తి, డిసెంబరు 31 : పాల్కూరికి సోమనాథుడి సాహిత్యానికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని, దీనికి సోమనాథ కళాపీఠం దోహదపడుతుందని తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు అన్నారు. ఆదివారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో సోమనాథ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పురస్కారాల ప్రదానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం సమీపంలోని పాల్కూరికి సోమనాథుడి విగ్రహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహితీ విప్లవమూర్తి పాల్కూరికి సోమనాథుడి పేరుతో కళాపీఠం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సాహిత్యం, కళా, పండిత, పరిశోధన రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి పురస్కారాలు అందజేయడం కళాపీఠం గొప్పతనమని కొనియాడారు. రెండేళ్లకోసారి కవులు, రచయితలను, కళలను గుర్తించి పురస్కారాలు అందించడం మహత్కార్యమని అన్నారు.

సోమనాథుడు సమాజంలోని పేదలను చైతన్యం చేయడం కోసమే గ్రంథాలు రాశారని కిషన్‌రావు గుర్తుచేశారు. మూడు దశాబ్దాలుగా పురస్కారాలు అందజేస్తున్న సోమనాథ కళాపీఠం సేవలు శ్లాఘనీయమని కొనియాడారు. అనంతరం పురస్కారాలు ప్రదానం చేశారు. సోమనాథ సాహిత్య పురస్కారాన్ని డాక్టర్ కానుకుర్తి శెట్టి సోమశేఖర్, సామాజిక శోధన పురస్కారాన్ని డాక్టర్ నలిమెల భాస్కర్, రంగస్థల పురస్కారాన్ని మంచాల రమేష్, పందిళ్ల శేఖర్‌బాబు.. రాజయ్య శాస్త్రి స్వచ్ఛంద భాషా సేవా పురస్కారాన్ని డాక్టర్ మైథిలి అబ్బరాజు, చలపతిరావు సాహిత్య పురస్కారాన్ని ఎం.ఎస్.ఆర్.వెంకటరమణ, ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారాన్ని డాక్టర్ సి.ఎస్.ఆర్. ప్రభు, రాపోలు సోమయ్య ప్రతిభా పురస్కారాన్ని డాక్టర్ అరూరి మహేందర్, దేవగిరి రాజయ్య స్మారక పురస్కారాన్ని బూస రేణుకారాధ్య స్వీకరించారు. కార్యక్రమానికి కళాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ సత్యనారాయణ అధ్యక్షత వహించగా, ప్రొఫెసర్ ప్రభంజన్‌కుమార్, ప్రొఫెసర్ అవుటి జగదీష్, సర్పంచు యాకాంతరావు, నర్సింహారెడ్డి, మార్గం లక్ష్మీనారాయణ, జక్కుల రవీందర్, గూడూరు లెనిన్, వీరమనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అజరా హాస్పిటల్‌లో హెల్త్ చెకప్ క్యాంపెయిన్ ప్రారంభం

హనుమకొండ అర్బన్, డిసెంబరు 31: అజరా హాస్పిటల్‌లో హెల్త్ చెకప్ క్యాంపెయిన్ ప్రారంభమైంది. జనవరి 1వ తేదీ నుంచి 31 వరకు ప్రివెంటివ్ హెల్త్ చెకప్ క్యాంపెయిన్‌ని ప్రారంభించడం గర్వంగా ఉందని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. 54శాతం వరకు తగ్గింపుతో బాడీ చెకప్ ఉంటుందన్నారు. పరిమిత స్లాట్‌లు అందుబాటులో ఉన్నందున

అజరా హాస్పిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 9391009701 లేదా, 9391009702 సంప్రదించాలన్నారు.

నేడు జూపార్కులో సందర్శకులకు అనుమతి

హనుమకొండ సిటీ, డిసెంబరు 31: హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జూలాజికల్ పార్కులో సోమవారం సెలవుతో నిమిత్తం లేకుండా సందర్శకులకు అనుమతి కల్పించినట్లు ఇన్‌చార్జి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వి.రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిమ్మింగ్ సౌత్ వెస్ట్ జోన్

పోటీలకు కేయూ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, డిసెంబరు 31: జనవరి 2 నుంచి 4 వరకు తమిళనాడులోని ఎస్ఆర్ఎంఐఎస్టీ యూనివర్సిటీలో జరిగే సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు పురుషుల, స్త్రీల సిమ్మింగ్ కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాసరావు ఆదివారం ప్రకటించారు. 2023-24 ఏడాదికిగాను కాకతీయ యూనివర్సిటీ నుంచి జట్టు పాల్గొంటుందని వెల్లడించారు. ఎంపికైన వారిలో మెన్స్ విభాగంలో కేటీ రాఘవేందర్, పి.శ్రవణ్‌చంద్ర (డీఆర్ఎస్ డీసీ డిగ్రీ కళాశాల, ఖమ్మం), బి.శ్రీకాంత్ నాయక్, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), కె.అక్షిత్ (కేయూ ఇంజనీరింగ్ కళాశాల, హనుమకొండ) ఎంపికయ్యారు. అలాగే వుమెన్స్ విభాగంలో బి.మహేశ్వరి, (బాలాజీ వుమెన్స్ డిగ్రీ కళాశాల, నర్సంపేట) ఎంపికైనట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు వెల్లడించారు.

జట్టుకు మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రమేశ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారు. జట్టుకు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావుల అభినందించారు.

కొత్త సంవత్సరం... కోటి ఆశలు

● జాబ్ క్యాలెండర్ వైపు నిరుద్యోగుల చూపు ● సంక్షేమ పథకాలపై కొత్త ఆశలు ● ఊరిస్తున్న నామినేటెడ్ పదవులు ● పాలనా పరంగా చోటు చేసుకోనున్న మార్పులు

హనుమకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కాల చక్రంలో మరో ఏడాది కరిగిపోయింది. తీపి జ్ఞాపకాలు, చేదు అనుభవాలు మిగిల్చి కాలగర్భంలో కలిసి పోయింది. కొత్త ఆశలు. సరికొత్త ఆకాంక్షలతో కొత్త సంవత్సరం ఆరంభమైంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2024 సంవత్సరానికి ఉత్సాహంగా సంబరంగా స్వాగతం పలికారు. కొత్త సంవత్సరంలో అంతా శభమే జరగాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సరంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆశలు, ఆకాంక్షలను వ్యక్తీకరించుకుంటున్నారు. గతం గతః... కొత్త ప్రభుత్వం ఏర్పాటయిన నేపథ్యంలో కనీసం ఈ సంవత్సరమైన తమ ఉద్యోగాలు రావాలని నిరుద్యోగులు ఆశ పడుతున్నారు. సంక్షేమ పథకాలు అందాలని నిరుపేదలు కోరుకుంటున్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాలని అన్నివర్గాలు కోరుకుంటున్నారు. బీఆర్ఎస్‌ను ఓడించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పరుగులు పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు కొత్త సంవత్సరం అంతా ఎన్నికల సందడే ఉండనున్నది. లోక్‌సభ, శాసన మండలి, పంచాయతీ ఎన్నికలపై నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నామినేటెడ్ పదవులను కాంగ్రెస్ నేతలను ఊరిస్తోంది.

● జాబ్ క్యాలెండర్...

కొత్త సంవత్సరంపై నిరుద్యోగులు కోటి ఆశలు పెట్టుకున్నారు. 2023 సంవత్సరం వారికి ఉద్యోగాల విషయంలో చేదు అనుభవాలనే మిగిల్చింది. టీఎస్పీఎస్సీ పేపర్ల లీకేజీ, గ్రూప్ 1, గ్రూప్ 2 సహ కమిషన్ నిర్వహించిన పలు పరీక్షల్లో అవకతవకలు, వరుస వాయిదాల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ అన్నట్టుగానే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించింది, మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్త సంవత్సరంలో ఏ ఏ ఉద్యోగాలకు ఎప్పుడెప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చేది తేదీలతో సహా ప్రకటించింది. నిరుద్యోగులు ఈ జాబ్ క్యాలెండర్‌పై కోటి ఆశలు పెట్టుకున్నారు. ఇది అమలైతే ఈ కొత్త సంవత్సరంలో తమకు ఉద్యోగాలు దొరకడం ఖాయమన్న ఆశతో ఉన్నారు.

నిరుపేద ప్రజలు ఈ కొత్త సంవత్సరం నుంచి అమలు కానున్న సంక్షేమ పథకాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆరు గ్యారెంటీలపేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పథకాల అమలు కోసం కోసం ప్రజలు ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్నారు. ఈ పథకాల అమలుకు ప్రభుత్వం అప్పుడే శ్రీకారం కూడా చుట్టింది. గృహలక్ష్మి పథకంలో భాగంగా మహిళకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చింది. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని ప్రభుత్వం చెబుతుండడంతో ఈ పథకాలపై అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

● పెండింగ్ పనులు పూర్తయ్యేనా ?

ఉమ్మడి జిల్లాలో అనేక అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. కనీసం ఈ కొత్త సంవత్సరంలోనైనా వీటికి మోక్షం లభించాలని ప్రజలు కోరుతున్నారు. కనీసం ఈ ఏడైనా కాళోజీ కళాక్షేత్రం , వేయిస్తంబాల గుడి కళ్యాణ మండపం, పాతిమానగర్ సమాంతర బ్రిడ్జి, రింగ్ రోడ్డు, వడ్డెపెల్లి బండ్ సుందరీకరణ, స్మార్ట్ రోడ్లు, రూ 1100 కోట్ల వ్యయంతో నిర్మాణం అవుతున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పూర్తికావాలని కోరుతున్నారు. మాస్టర్ ప్లాన్‌కు కనీసం ఏ ఏడు అయినా కొత్త ప్రభుత్వం ఆమోద ముద్ర వేయాలని కాంక్షిస్తున్నారు. ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం పనులు మొదలు కావాలనీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీకి అడుగులు పడాలని కోరుతున్నారు. పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పంచాలనీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొత్త ఇళ్ల నిర్మాణం జరగాలని కోరుతున్నారు.

● ఎన్నికలపై ఆశలు:

గత సంవత్సరం చివరలో మొదలైన ఎన్నికల సందడి ఈ కొత్త సంవత్సరం అంతా కొనసాగనున్నది. కొత్త సంవత్సరం ఆరంభంలో జరగనున్న పార్లమెంట్, ఎమ్మెల్సీ, పంచాయతీ ఎన్నికలపై నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నాయకులు లోక్ సభ ఎన్నికల్లో, అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. పంచాయతీ ఎన్నికలపై కూడా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆశావ"హులు ఇప్పటికే టికెట్ల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు.

● నామినేటెడ్ పదవులపై దృష్టి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు నామినేటెడ్ పదవులపై దృష్టి సారించారు. గట్టిగా ప్రయత్నిస్తే ఈ కొత్త సంత్సరం ఏదైనా ఒక పదవి రాకపోతుందా అని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించి భంగపడ్డవారు, పోటీ చేసి ఓడిపోయినవారు, అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసినవారు, పార్టీ కోసం ఎంతో కాలంగా పని చేస్తున్నవారు, సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు అనేక మంది నామినేటెడ్ పదువులపై ఆశలు పెట్టుకు న్నారు. పలు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదువులు వీరిని ఊరిస్తున్నాయి.

● అవిశ్వాసాలు

అవిశ్వాస తీర్మానాలతో పలువురి మున్సిపల్ ఛైర్మెన్ పదవులు ఊడిపోనున్నాయి. ఈ సంవత్సరం ఇది వారికి చేదు అనుభవమే కానున్నది. ఉమ్మడి జిల్లాలో వరంగల్ నగర పాలక సంస్థతో పాటు తొమ్మిది మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి ఛైర్మెన్లు అందరు బీఆర్ఎస్‌కు చెందిన వారే. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పుడే వీటిపై దృష్టి సారించింది. అవిశ్వాస తీర్మానాలు పెట్టడం ద్వారా వారిని గద్దె దించి కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి ఇచ్చేందుకు అప్పుడే పావులు కదుపుతోంది. జనగామ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానానికి అప్పుడే ప్రయత్నాలు మొదలయాయి.

● మార్పులు చేర్పులు:

ఈ కొత్త సంవత్సరం పాలనా పరంగా అనేక మార్పులు చేర్పులు చోటు చేసుకోనున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే దీనిపై దృష్టి సారించింది. పాలనను ప్రజల వద్దకు చేర్చేందుకు మార్పులకు అప్పుడే శ్రీకారం చుట్టింది. ఈ ఏడు ఈ దిశగా ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆ ప్రభావం ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా పడనున్నది. బదిలీలు, పదోన్నతులతో కొత్త సంవత్సరం తమకు తీపి కబురు అందవచ్చునని ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

▸▸ జోరుగా కొత్త సంవత్సరం వేడుకలు



హనుమకొండ హరిత హోటల్‌లో యువతుల నృత్యాలు

హనుమకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2024 కొత్త సంవత్సరానికి ప్రజలు కోటి ఆశలతో స్వాగతం పలికారు. రాత్రి 12 గంటలకు పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి సాదరంగా ఆహ్వానించారు. నూతన సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలని, అందరూ సంతోషంగా, సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చరవాణిల్లో సందేశాలు వెల్లువెత్తాయి. హ్యాపీ న్యూయర్.. అంటూ ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. 2024 ప్రవేశానికి శుభసూచనగా పెద్దఎత్తున బాణాసంచాను పేల్చారు. కేకులు కట్ చేశారు. స్వీట్లను పంచుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. సంతోషంతో నృత్యాలు చేశారు. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ పాటలు పాడారు.

ఏరులై పారిన మద్యం

కొత్త సంవత్సరం పుణ్యమా.. అని మద్యం ఏరులై పారింది. ఉదయం నుంచే మద్యం షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడుతూ కనిపించాయి. సాయంత్రం మద్యానికి గిరాకీ మరింత పెరిగింది. రాత్రి ఒంటి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతూనే ఉన్నాయి. బార్లు, రెస్టారెంట్లు మందుబాబులతో కిటకిటలాడాయి. హోటళ్లు, డాబాలు, రిసార్టులు అర్ధరాత్రి వరకు విందు లు, వినోదాలతో హోరెత్తాయి. హాస్టళ్లలో విద్యార్థులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆట, పాటలతో కేరింతలు కొట్టారు. అపార్టుమెంట్ల సెల్లార్లు, రూఫ్‌టాప్‌లు కొత్తపార్టీ వినోదాలతో ఊగిపోయాయి. రంగురంగుల విద్యుదీపాల నడుమ అపార్టుమెంట్లువాసులు తెల్లవారుజాము వరకు పార్టీల్లో మునిగి పోయారు. నగరంలో పేరున్న పలు హోటళ్లు కూడా న్యూ ఇయర్ ఈవెంట్లను నిర్వహి ంచాయి. పలు మధ్యతరగతి, సంపన్న కుటు ంబాలు పెద్దసంఖ్యలో హాజరైన ఈ ఈవెంట్లు డీజే మ్యూజిక్‌తో ఆకట్టుకున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టరాని సంతోషంతో న్యూ ఇయర్ వేడుకలను జరుపుకున్నారు. ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు.

కేకులు, స్వీట్లు

కొత్త సంవత్సరం సంబరాల్లో భాగంగా చాలా మంది ఇళ్లలో కేకులు కట్ చేశారు. స్వీట్లను పంచుకున్నారు. ఉదయం నుంచి అన్ని బేకరీ షాపులు, స్వీట్ షాపులు కొనుగోలుదారులతో పోటెత్తాయి. న్యూయిర్‌ను పురస్కరించుకొని బేకరీలు వివిధ రకాల కేకులను తయారు చేసి సిద్ధంగా ఉంచాయి. వీటిపై ఆఫర్లను కూడా ఇచ్చాయి. మూడు కిలోలకు మించి కేక్ కొన్నవారికి ఒక లీటరు కూల్ డ్రింక్ ఉచితంగా ఇచ్చారు. మరికొన్ని చోట్ల 5కిలోల కేకు కొంటే కిలో కేక్ ఫ్రీగా అందచేశారు. స్వీట్‌షాపులు సైతం ఆఫర్లతో ఆకట్టుకున్నాయి. రెండు కిలోలకు మించి స్వీట్లు కొన్నవారికి పావుకిలో మిక్చర్ ఉచితంగా అందచేశాయి.



పద్మాక్షి గుట్ట సమిపంలో ని హాస్టల్ లో న్యూయర్ వేడుకలు

యూత్ జోష్..

నగరంలో న్యూ ఇయర్ సందడి

హనుమకొండ క్రైం, డిసెంబరు 31: నూతన సంవత్సర వేడుకలు ఫుల్ జోష్‌గా జరిగాయి. అర్ధరాత్రి నగరంలో ఉత్సాహపూరిత వాతావ రణంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. వరంగల్ కమిషనరేట్ పోలీసులు నిబంధలను కఠినతరం చేసినా యువత స్పీడుకు కళ్లెం వేయలేకపోయారు. కొందరు యువకులు పోలీసుల నిబంధనలు అతిక్రమించి మత్తు జోష్‌లో మునిగిపోయి రోడ్లపై చెక్కర్లు కొట్టగా.. మరి కొందరు ఇళ్లకే పరిమితమై వేడుకల్లో మునిగిపోయారు. రాత్రి 12 గంటలు కొట్టగానే నగరం భారీ శబ్దాలతో బాణాసంచా మోతలతో దద్దరిల్లింది. యువతీ, యువకుల కేరింతలతో కొత్త సంవత్సర వేడుకలు మిన్నంటాయి. డీజే సౌండ్స్ ఏర్పాటు చేసుకుని డ్యాన్సుల్లో మునిగిపోయారు. రోడ్లపై కుర్రకారు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుగూ సెలబ్రేషన్స్‌లో మునిగిపోయారు. రయ్.. రయ్.. మంటూ బైక్‌లపై పర్యటిస్తూ రెచ్చిపోయారు. కొత్త సంవత్సర వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ ఘట నలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు పోలీసులు జాగ్రత్తపడ్డారు. సాయంత్రం 6 గంటల నుంచే శాంతిభద్రతల పరిరక్షణ కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో గొడవలు, అల్లర్లు తలెత్తకుండా ఉండేందుకు లా అండ్ ఆర్డర్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ ఆదేశాల మేరకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ సెంటర్‌లో పోలీ సు పికెటింగ్‌లో ఏర్పాటు చేశారు. 380 మంది పోలీసులు రంగంలోకి దిగి డ్యూటీలు చేశారు. అడుగడుగునా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. సుమారు 542 మంది మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు. ఈ- చలానా పద్ధతిలో ఫైన్‌లు విధించి ఉట్టి చేతులతో పంపించారు. బైక్‌లపై త్రిపుల్ రైడింగ్ చేయకుండా పోలీసులు డేగకళ్లతో వీక్షించారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు రోడ్లపై నిఘా పెట్టారు. మహిళా వసతి గృహాలు, మహిళా కళాశాలల వద్ద పోలీసులు మఫ్టీ లో కాపుకాచి ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఇంకా కొందరు యువత గంజాయి మత్తులో తూగుతూ రోడ్లపై హల్‌చల్ చేశారు. నగరంలోని మహిళలు నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని 31 రాత్రి 10 గంటల నుంచే వాకిళ్లలో ముత్యాల ముగ్గులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. అనంతరం మహిళలు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కేకులు కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. సీపీ కార్యాలయంలో కమిషనర్ కిశోర్ ఝా కేక్ కట్ చేసి సిబ్బందికి పంచారు.



నగరంలోని ఓ వైన్స్ వద్ద గుమికూడిన జనం

వైన్స్‌షాపుల వద్ద హంగామా

డిసెంబరు 31 సందర్భంగా ఆదివారం రాత్రి పోలీసు కమిషనరేట్ పరిధిలోని మద్యం షాపుల వద్ద యుద్ధ వాతావరణం నెలకొంది. మద్య ం కొనుగోలు చేసేందుకు మద్యంప్రియుల పోటెత్తా రు. వైన్స్, బార్‌షాపుల ముందు దడికట్టారు. ఇక నగరంలోని ప్రతీ మద్యం షాపుల ముందు జాతర వాతావరణం నెలకొంది. నగరంలోని అన్ని బార్లు, వైన్స్, రెస్టారెంట్లతో పాటు నగర శివారులో సైతం వెలసిన బెల్టుషాపుల వద్ద మందు ప్రియులు ఫుల్లుగా తాగి చిందులు వేశారు. ఇదే అదునుగా భావించిన కొందరు మద్యం వ్యాపారులు ఇష్టం వచ్చిన రేట్లకు అమ్ముకున్నట్టు యువకులు వాపోయారు.

ఎంజీఎం ఆస్పత్రిని ప్రక్షాళన చేస్తాం..

● హెల్త్ సిటీ పేరుతో పెద్దాస్పత్రి అభివృద్ధి కుంటు పడింది ● దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హనుమకొండ అర్బన్, డిసెంబరు 31: ఎంజీఎం ఆస్పత్రిలో మెరుగైన సేవలు విస్తృతపరిచేందుకు ఆస్పత్రిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఎంజీఎం ఆస్పత్రిని ఆదివారం మధ్యాహ్నం కొండా సురేఖ సందర్శించారు. తొలుత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. పేద రోగులకు అన్ని రకాల వసతులను ప్రభుత్వం కల్పించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఉత్తర తెలంగాణకే తలమానికంగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రి గుండెకాయ లాంటిదన్నారు. దీనిని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. 14 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయని, మందుల కొరత లేకుండా అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఇటీవల కోతుల బెడద వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వెంటనే అధికారులు అప్రమత్తమై పునరుద్దరించారని మంత్రి సురేఖ చెప్పారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు ఐదు జనరేటర్ల ద్వారా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఈ ఘటన వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. తొమ్మిది రోజుల వ్యవధిలో 25కు కరోనా కేసులు పెరిగాయని సురేఖ వెల్లడించారు. కరోనా రోగులకు ప్రత్యేక వార్డుల్లో చికిత్స అందుతోందని అన్నారు. ఎంజీఎంలో ప్రస్తుతం 25 మంది కరోనాతో చికిత్స పొందుతున్నారని, వీరిలో ఎలాంటి ప్రాణాపాయం లక్షణాలు లేవని ఆమె స్పష్టం చేశారు. ఈ నెల 21 నుంచి 170 మంది రోగులకు కరోనా పరీక్షలు నిర్వహించగా 25 మందికి పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని, పది మంది ఎంజీఎంలో చేరి చికిత్స పొందుతున్నారని తెలిపారు. 1200 ఆక్సిజన్ బెడ్స్, మూడు ఆక్సిజన్ ట్యాంకులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. కాగా, హెల్త్‌సిటీ పేరుతో నిర్మిస్తున్న ఆస్పత్రి గురించి ఎంజీఎం అధికారుకు సమాచారం లేకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ చంద్రశేఖర్, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డి.మోహన్‌దాస్, టీఎస్ఎంఐడీసీఎస్ ఇ.దేవేంద్ర కుమార్, ఎస్పాడీసీఎల్ డీఈ మల్లికార్జున్, ఆర్ఎంఓ మురళి, అడిషనల్ ఆర్ఎంవోలు, వైద్యులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

పేదరిక నిర్మూలనే ప్రధాని మోదీ ధ్యేయం

కేంద్ర మంత్రి బీఎల్.వర్మ

హనుమకొండ రూరల్, డిసెంబరు 31: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కేంద్ర సహకార శాఖ, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ తెలిపారు. ఆదివారం హనుమకొండలోని కలెక్టరేట్ ముందు వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి బీఎల్.వర్మ మాట్లాడారు. ముందుగా ప్రధాని నరేంద్ర మోదీ మన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయం చేసే రైతులకు ఎకరానికి రూ.2వేల ఆర్థిక అందించడంతోపాటు కిసాన్ భరోసా కింద సబ్సిడీ ఎరువులను సైతం కేంద్రం పంపిణీ చేస్తోందన్నారు. సబ్సిడీ గ్యాస్, ఎరువులు, ముద్ర లోన్లు, ఆయుష్ భారత్, బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన, సురక్ష యోజన ఇలా ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టారని తెలిపారు. పేదరిక నిర్మూలన, పేదల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని కేంద్ర మంత్రి అన్నారు. అనంతరం వికాసిత్ భారత్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, బీజేపీ నాయకులు కొలను సంతోష్‌రెడ్డి, దేశిని సదానందంగౌడ్, కుమారస్వామి, రాంచంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, మధుసూదన్‌రావు, శ్రీనివాస్, రాజు, కళ్యాణ్, శ్రీధర్, అన్వేష్, వాణిశ్రీ, వివిధ బ్యాంకులకు చెందిన చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వికాసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఎల్.వర్మ

ఏపీలో గుట్టుగా

ఇసుక దోపిడీ షురూ!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీలో గుట్టుగా ఇసుక దోపిడీ షురూ అయింది. 2023-25 కాలానికిగాను ఇసుక తవ్వకాలు, అమ్మకాలకు సంబంధించిన టెండర్ల వ్యవహారమంతా సీక్రెట్‌గా జరిగిపోయింది. జగన్ సర్కారు కంపెనీలను ఎంపిక చేసి అమ్మకం బాధ్యతలు కూడా అప్పగించింది. ఉత్తర్వులు కూడా జారీ చేసింది. వాటిలో ఒకటి తెలంగాణకు చెందిన మాజీ ఎంపీ, బీఆర్ఎస్ ముఖ్యనేత బోయినపల్లి వినోద్‌కుమార్ సోదరుడు శ్రీనివాసరావుకు చెందిన ప్రతిమ కంపెనీ. ఆయన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్వయానా మేనల్లుడు. మరొకటి రాజస్థాన్‌కు చెందిన జీసీకేసీ కంపెనీ. కంపెనీలతో జగన్ సర్కారు డిసెంబరు 11న సీక్రెట్ గా ఒప్పందాలు చేసుకుంది. అదే రోజు నుంచి ఇసుక అమ్మకం బాధ్యతలను వాటికి అప్పగించింది. కానీ.. డిసెంబరు 22న గనుల శాఖ దీనిపై కలెక్టర్లకు, అధికారులకు లేఖ రాసింది. అగ్రిమెంట్ కుదిరిన రోజు నుంచే ప్యాకేజీల వారీగా ఆయా జిల్లాల్లో ఆయా సంస్థలు ఇసుక తవ్వకాలు, అమ్మకాలు చేస్తున్నట్లుగా పరిగణించాలని గనుల శాఖ డైరెక్టర్ ఆ లేఖలో సూచించడం గమనార్హం. ఈ జగన్నాటకం వెనుక మరో పెద్ద రహస్యం ఉంది. అదేంటంటే.. కంపెనీలు ఏవైనా, ఇసుక అమ్మకాలను పర్యవేక్షించేది ముఖ్యమంత్రి తమ్ముడు అనిల్‌రెడ్డే. ఏపీ సర్కారుకు వేల కోట్ల ఆదాయం తెచ్చిపెట్టే ఈ ఇసుక అమ్మకాల వ్యవహారంలో అంతా రహస్యమే. రాయల్టీ, ఫీజులు ఎంతో.. వెల్లడించడం లేదు. కీలకమైన పర్యావరణ అనుమతుల విషయంపై కూడా గప్‌చుప్! వైసీపీ సర్కారు గతంలో జేపీ వెంచర్స్‌కు ఇసుక టెండర్ ఇచ్చినప్పుడు.. దాని విలువ ఎంతో ప్రకటించింది. నిబంధనలు, చెల్లించాల్సిన రాయల్టీ, సీనరేజీ, కన్సిడరేషన్ ఫీజులు ఎంతో ముందే ప్రకటించింది. కానీ ఇప్పుడు మాత్రం ఆ వివరాలన్నింటినీ రహస్యంగా ఉంచుతోంది.

నిబంధనలను తోసిరాజని..

టెండర్ నిబంధనల ప్రకారం.. ఇసుక వ్యాపారం చేసిన అనుభవం ఉన్న సంస్థలకే పనులు అప్పగించాలి. కానీ.. ప్రతిమ కంపెనీకి ఇంతకు ముందు ఇసు క వ్యాపారం చేసిన అనుభవం లేదు. జీసీకేసీదీ అదే పరిస్థితి. అయినా నిబంధనలు తోసిరాజని ఆ కంపెనీలకు పనులు అప్పగించారు. ఇలా అక్రమంగా ఇసు క టెండర్లు దక్కించుకున్న ప్రతిమ, జీసీకేసీలు ఇసుక తవ్వకాలు, అమ్మకాల వ్యాపారం మొదలుపెట్టాయి. అయితే ఇసుక అమ్మకాల సందర్భంగా ఇచ్చే రహదారి బిల్లులపై కీలకమైన జీఎస్టీ నంబర్‌ను మాత్రం జీసీకేసీ సంస్థ ముద్రించట్లేదు. దీంతో ఆ సంస్థ జీఎస్టీ నంబరు తీసుకోకుండానే ఇసుక వ్యాపారం మొదలుపెట్టిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని గనుల శాఖ చూసీచూడనట్టు వదిలేస్తోంది. అలాగే.. ఇసుక తవ్వకాలకు విధిగా పర్యావరణ అనుమతులు కావాలి. కానీ, కొత్తగా ఆ అనుమతులు లేకుండానే టెండర్లు నిర్వహించడం గమనార్హం.

మూడు రోజుల్లో 67,209 దరఖాస్తులు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 31: జిల్లాలో నిర్వహించిన ప్రజా పాలన ద్వారా అభయ హస్తం గ్యారంటీ పథకాలకు అర్హుల నుంచి మూడు రోజుల్లో 67,209 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ శశాంక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 28, 29, 30 తేదీల్లో జిల్లాలోని 461 గ్రామ పంచాయతీల్లో 234 జీపీల్లో, నాలుగు మునిసిపాలిటీల్లోని 82 వార్డుల పరిధిలో 54 వార్డు సభలు వెరసి మొత్తంగా 288 సభలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజా పాలన దరఖాస్తులపై సంప్రదించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఇతర వివరాలకు కంట్రోల్ రూమ్ నెంబరు 79950 74803ను సంప్రదించాలన్నారు.

ఏటీఏ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క



ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

గూడూరు, డిసెంబరు 31 : ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏటీఏ) వార్షిక క్యాలెండర్‌ను రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదివారం ఆవిష్కరించారు. ములుగులోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్కను సంఘం బాధ్యులు కలిసి ఏజెన్సీ ఉపాధ్యాయుల సమస్యలు, కోర్టు కేసులను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు, నాయకులు సురేందర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, కల్తీ కుమార్, మూతి భద్రి, పెనక ప్రభాకర్, సూర్యనారాయణ, వీరస్వామి, శ్రీనివాస్, పాపారావు, వెంకన్న, సాంబయ్య, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమ నిధితో ఆర్థిక ప్రయోజనం

▸▸ సంతాప సభలో ఎమ్మెల్యే మురళీనాయక్



అనూష కుటుంబ సభ్యులకు రూ.6 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 31: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సంఘం(టీఎస్ యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుటుంబ సంక్షేమ నిధి సంఘ సభ్యులకు ఎంతో ఆర్థిక ప్రయోజనాన్ని ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కందుల అనూష సంతాప సభను మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలోఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కుటుంబ సంక్షేమ నిధి ద్వారా సంఘం సమకూర్చిన రూ.6 లక్షల చెక్కును అనూష భర్త నర్సయ్య, పిల్లలకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2004 తర్వాత నియామకమైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం రద్దు కావడం... సీపీఎస్ విధానం అమలు జరుగుతున్నందున పదవీ కాలంలో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వంనుంచి ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేకపోవడంతో యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు.

ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అనంతరం టీఎస్ యూటీఎఫ్ 2024 నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో డీఈవో రామారావు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య ప్రధాన కార్యదర్శులు శేఖర్, నాగమణి, మల్లారెడ్డి, నాయకులు బండి నర్సింహారావు, స్వప్న, నాగమల్లయ్య, నామ వెంకటేశ్వర్లు, యాకూబ్, హుస్సేన్, మంజుల, భద్రు, సంజీవ, హరి, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, వంశీ, యాకయ్య, భిక్షపతి, కృష్ణ, హెచ్‌ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలి

తెలంగాణలో ప్రజాస్వామిక పాలనను అందిస్తున్నామని, ఉపాధ్యాయులు స్వేచ్ఛగా విధులు నిర్వహించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని టీపీటీఎఫ్ భవన్‌లో సావిత్రిబాయి పూలే సహకార పరపతి సంఘం 6వ వార్షికోత్సవం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి గ్రామం, తండాల్లో ప్రభుత్వ బడి ఉండాలని, మూసివేసిన బడులను తెరిపించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని చెప్పారు. కార్యక్రమంలో రమేష్, కవిత, చుంచు శ్రీశైలం, విష్ణువర్ధన్, సువర్ణ, మల్లారెడ్డి, కోడెం శ్రీనివాస్, రాచకొండ ఉపేందర్, సజ్జనం విద్యాసాగర్, రాజు, అంజయ్య, గోవర్ధన్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : ఎమ్మెల్యే

మహబూబాబాద్ టౌన్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ 2024 నూతన సంవత్సర వాల్, ప్యాకెట్ క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య, డాక్టర్ సీహెచ్. దేవిరెడ్డి, బి.రవీంద్రగుప్తా, ఆకుల శంబయ్య, తండా సదానందం, నల్లు సుధాకర్‌రెడ్డి, గోవర్ధన్, వెంకట్‌రెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మీనర్సింహారావు, శేఖర్, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, వీరారెడ్డి, నక్క నాగార్జున, నజీర్, బోనగిరి ప్రసాద్, దుర్గారావు పాల్గొన్నారు.

చర్లతండా వాసికి డాక్టరేట్

గూడూరు, డిసెంబరు 31:మండలంలోని గుండెంగ గ్రామ శివారు చర్లతండాకు చెందిన బోడ వంశీకి ఉస్మానియా యూనివర్సిటీ ఆదివారం డాక్టరేట్ ప్రకటించింది. 2016-2023లో ఉస్మానియా యూనివర్సిటీలో 'తెలంగాణ రాష్ట్రంలో గిరిజన అభివృద్ధి విధానం' అనే అంశంపై ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో అధ్యయనం చేశారు. సీనియర్ ప్రొఫెసర్ సతీష్‌చంద్ర పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అందుకు గాను బోడ వంశీకి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది.

నాయీబ్రాహ్మణ సంఘం పట్టణ కమిటీ

కేసముద్రం, డిసెంబరు 31: నాయీబ్రాహ్మణ సంఘం కేసముద్రం పట్టణకమిటీ అధ్యక్షుడిగా జంపాల రమేష్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు జంపాల విక్రమ్ ఆదివారం తెలిపారు. ఈ కమిటీ ప్రధాన కార్యదర్శిగా లింగాల రమేష్, ఉపాధ్యక్షుడిగా లింగాల యాకయ్య, కోశాధికారిగా జంపాల రాంప్రసాద్, సహాయ కార్యదర్శి లింగాల చిన్నవెంకటేశ్వర్లు, గౌరవ సభ్యులుగా లింగాల సుదర్శన్, సురేందర్, అంజయ్య, లక్ష్మీనారాయణ, రాజు ఎన్నికయ్యారు.

యాదవ యంగ్ స్టార్ యూత్ కమిటీ ఎన్నిక

ఇనుగుర్తి, డిసెంబరు 31: మండలంలోని చిన్నముప్పారంలో యాదవ యంగ్ స్టార్ యూత్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2024-25 సంవత్సరానికి యూత్ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన బోళ్ల అనిల్, ప్రధాన కార్యదర్శిగా కారుపోతుల ఉమేష్, ఉపాధ్యక్షుడిగా మార్గం మల్లయ్య, కార్యదర్శిగా వేణు, కోశాధికారిగా జక్కుల యాకన్న, ప్రధాన సలహాదారులుగా నర్ర యాకాంబ్రం, జక్కుల రాజ్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు సంఘం బాధ్యులు తెలిపారు.

పేదల ఆరోగ్య ప్రదాయిని సీఎంఆర్ఎఫ్ : ఎంపీ



మహబూబాబాద్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీ కవిత

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 31 : సీఎంఆర్ఎఫ్ పేదలకు ఆరోగ్య ప్రదాయినిగా నిలుస్తుందని ఎంపీ మాలోతు కవిత అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం 45 మంది లబ్ధిదారులకు రూ.18.32 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నిరుపేదలు సైతం కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకునే విధంగా సీఎంఆర్ఎఫ్ దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యులు షేక్, మహబూబ్ పాషా, మునిసిపల్ కౌన్సిలర్ సలీం, సర్పంచ్ బోడ లక్ష్మణ్, బండమీద సంపత్, బానోత్ రాము, అసీఫ్ అలీ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు ఎంపీ పరామర్శ

మరిపెడరూరల్: మండలంలోని తాళ్లవూకల్‌కు చెందిన కొంపెల్లి రాంరెడ్డి రెండు రోజుల క్రితం మృతి చెందాడు. కాగా, రాంరెడ్డి మరిపెడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత ఆదివారం వెళ్లి రాంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, నాయకులు రాంబాబు, రవీందర్ నాయక్, డాక్టర్ రవినాయక్, కృష్ణ, రెడ్డి పాల్గొన్నారు.

వామపక్ష శక్తులు ఏకం కావాలి : సీపీఎం

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 31 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసిందని, దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీపీఎం మహబూబాబాద్ మండల సమావేశాన్ని ఇస్లావత్ జోగ్యానాయక్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.

ఈ సమావేశంలో మండల కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, పోరెడ్డి వెంకన్న, ఎమ్డీ.యాకూబ్, చేపూరి గణేష్, నాగేల్లి సురేష్, బుర్ర వెంకన్న, ప్రశాంత్, మచ్చ వెంకన్న పాల్గొన్నారు.

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలి

తొర్రూరు, డిసెంబరు 31 : ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన బేడ బుడగ జంగాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ, ఎస్సీ, ఎస్టీ కమిషనర్, చైర్మన్, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ లాంటి పదవులు ఇవ్వాలని కోరుతూ అఖిల భారత బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు చింతల రవి, జాతీయ ప్రధాన కార్యదర్శి తూర్పాటి పాండు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్సీ, రాజ్యసభ, గవర్నర్ పదవుల పంపకాల్లో బేడ బుడగ జంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఖాళీ అయిన స్థానాల్లో తమ నాయకులకు పదవులు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలన్నారు. రాష్ట్రంలో సుమారు 20లక్షల మంది బేడ బుడగ జంగాలు ఉన్నారని, రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తున్నాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి తమకు సముచిత స్థానం కల్పిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బేడ బుడగ జంగాల సంఘం నాయకులు అనంతయ్య, ముత్తయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భూపోరాటాల్లో తలారిది ముఖ్య భూమిక

▸▸ సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 31: మహబూబాబాద్ ప్రాంతంలో భూ పోరాటాల్లో తలారి వెంకటేశ్వర్లు పాత్ర క్రియాశీలకమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మహబూబాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు నేత తలారి వెంకటేశ్వర్లు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా విజయసారథి మాట్లాడుతూ... ప్రజానేత సీపీఐ నాయకుడు తలారి వెంకటేశ్వర్లు తన గొంతులో ప్రాణమున్నంత వరకు పేదల పక్షాన పోరాడారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, నర్రా శ్రావణ్, అశోక్, ప్రవీణ్, రమేష్, మల్లికార్జున్, భద్రయ్య, మల్లయ్య, నాగార్జున, వికాస్, మంద శంకర్, తండా శ్రీనాథ్, రవి పాల్గొన్నారు.

పట్టణంలో మునిసిపల్ చైర్మన్ సుడిగాలి పర్యటన

▸▸ అభివృద్ధి పనులు పరిశీలించి పూర్తి చేయాలని ఆదేశాలు



డంపింగ్ యార్డు రోడ్డు పనులను పరిశీలిస్తున్న రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 31: మహబూబాబాద్ మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ తగు సూచనలు చేస్తూ త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పట్టణంలోని తొర్రూరు బస్టాండ్ సెంటర్‌లో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను సందర్శించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి పరిశుభ్ర పనులు చేపట్టి వీలైనంత త్వరగా లబ్ధిదారులకు మార్కెట్‌లో షాపులను కేటాయించాలని ఆదేశించారు. రైల్వే క్యాబిన్ రోడ్‌లో జరుగుతున్న రోడ్ ఫార్మేషన్ పనులు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించి సూచనలు చేశారు. 26వ వార్డులోని డంపింగ్ యార్డులో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. డ్రైనేజీ నీటి ప్రవాహం ఉన్న చోట పైపులు వేసి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. 23వ వార్డు పరిధిలోని ఎన్జీవోస్ కాలనీలో పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. గ్రీన్ ల్యాండ్‌లో ఏర్పాటు చేసిన పార్కులో చిన్నపిల్లల ఆటవస్తువులు పాడవగా పరిశీలించి మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జి కమిషనర్ ఉపేందర్, వార్డు కౌన్సిలర్లు మార్నేని శ్రీదేవిరఘు, దౌలాగర్ స్వాతిశంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దండె శ్రీహరి పాల్గొన్నారు.

వీరభద్రుడికి బెల్లయ్యనాయక్ పూజలు

కురవి, డిసెంబరు 31 : కురవి శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరభద్రస్వామి, భద్రకాళి ఆలయాల్లో మొక్కులు తీర్చుకుని మాట్లాడారు. కార్యక్రమంలో బోడ రవినాయక్, వెంకట్‌నాయక్, భట్టు దేవ్‌సింగ్, పరుశురాం, భీమానాయక్, శివనాయక్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

కురవి, డిసెంబరు 31 : కురవి పోలీస్ స్టేషన్‌ను మహబూబాబాద్ డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ శనివారం రాత్రి తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అండగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట రూరల్ సీఐ రమేష్‌నాయక్, కురవి ఎస్సై బైరు గోపి, సిబ్బంది ఉన్నారు.

వెంకటేశ్వర ఆలయ కమిటీకి సన్మానం

కేసముద్రం, డిసెంబరు 31 : మండలంలోని అమీనాపురంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన వెంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు వోలం మురళి, ప్రధాన కార్యదర్శి బచ్చు పరమేశ్వర్, కోశాధికారి కొయగూరి యాకూబ్‌రెడ్డి, అంబటి మహేందర్ రెడ్డిలను శనివారం రాత్రి కేసముద్రం వాకర్స్ క్లబ్ సభ్యుడు వోలం శ్రీను(రోహిణి) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వోలం రాజేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, చిదిరాల వసంతరావు, దామరకొండ ప్రవీణ్‌కుమార్, బండి సంపత్‌కుమార్, రామాచారి, పిన్ని రాము, సతీష్ పాల్గొన్నారు.

తెలుగు మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 31 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు-2024 వాల్ పోస్టర్లను డీఎస్పీ సత్యనారాయణ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... స్వభాష, కళలు, సంస్కృతుల పట్ల అభిమానాన్ని చాటి, ఆసక్తిని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జనవరి 5, 6, 7 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలో ఆంధ్రసారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో పాల్గొనే అవకాశం జిల్లా రచయితలకు కలగడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో గుర్రపు సత్యనారాయణ, పరికిపండ్ల అశోక్, టేకుల యాదగిరి రెడ్డి, ఎం.శ్రీనివాస్, నర్సయ్య, ప్రభాకర్, ఆరెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 31 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో జనవరి 2 నుంచి 5 వరకు జరిగే జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు వీఎస్ లక్ష్మీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. స్థానిక పాఠశాలలో ఆదివారం బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన కల్యాణి, గోపిచంద్‌లను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తొర్రూరులో డిసెంబరు 18 నుంచి 20 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, లావణ్య, మోహన్, వెంకన్న, హరీష్, సురేష్, మహ్మద్‌షేక్ అలీ పాల్గొన్నారు.

బాలికలు చదువుపై ఆసక్తి పెంచుకోవాలి

▸▸ ఎస్సై నిమ్మతోట జీనిత్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై జీనిత్‌కుమార్

గార్ల, డిసెంబరు 31: ప్రభుత్వం అందించే విద్యా పథకాలను బాలికలు సద్వినియోగం చేసుకొని చదువు పట్ల ఆసక్తి పెంచుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎస్సై నిమ్మతోట జీనిత్‌కుమార్ అన్నారు. గార్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆదివారం జర్నలిస్టు సీతారాంగౌడ్ ఏర్పాటు చేసిన జెస్టు ఫర్ లివింగ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు నోట్ బుక్స్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకొని పేద విద్యార్థులకు సహాయం చేయాలన్నారు. మహిళలు పురుషులతో సమానంగా చదువుల్లో రాణించి అన్ని విభాగాల్లో ఉద్యోగాలు సాధించే దిశగా ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎస్సై బానోత్ వెంకన్న, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ నాయక్, సీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, పాఠశాల హెచ్‌ఎం ఉషారాణి, సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు గుండా వెంకట్ రెడ్డి, జవ్వాజీ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్, సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, సీతారాం నాయక్ పాల్గొన్నారు.

వినియోగదారులను మోసం చేస్తే చర్యలు

తొర్రూరు, డిసెంబరు 31 : వ్యాపారులు వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవని జిల్లా తూనికలుకొలతల అధికారి విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని చికెన్ సెంటర్లు, బేకరీలు, రోడ్డు పక్కన ఉండే వ్యాపారుల తూనికలను తనిఖీ చేశారు. చికెన్ సెంటర్ నిర్వాహకులు వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవన్నారు. నాణ్యతతో పాటు సరైన కొలతలతో జోకి ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టం వచ్చిన రీతిలో కాంటాలు ఉపయోగించవద్దన్నారు. ఐదు చికెన్ షాపులు, బేకరీ నిర్వాహకులపై కేసు నమోదు చేసి రూ.15 వేల జరిమానా విధించామన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా వినియోగదారుల సమాఖ్య ఇన్‌చార్జి వింజమూరి సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి ఆటోడ్రైవర్ల క్షీరాభిషేకం



డోర్నకల్‌లో ఆటో డ్రైవర్లతో కలిసి సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

డోర్నకల్, డిసెంబరు 31: ఆటో డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు శ్యామ్‌నాయక్ అన్నారు. డోర్నకల్‌లోని గాంధీ సెంటర్‌లో ఆటో డ్రైవర్లు ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి బాణాసంచా కాల్చి సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డోర్నకల్ పట్టణకాంగ్రెస్ అధ్యక్షుడు కాల సుమీర్‌చంద్‌జైన్, నాయకులు మాద శ్రీనివాస్, ఎల్లావుల హరికృష్ణ, శీలం శ్రీనివాస్, రెడ్డబోయిన శంకర్, మెదరమెట్ల సత్యం, సుశీల్‌కుమార్ జైన్, ప్రవీణ్, వాసు, కోటి, పవన్‌కుమార్, సమ్మయ్య, నాగరాజు, రాహుల్ పాల్గొన్నారు.

కేంద్రంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న మోదీ

కేసముద్రం, డిసెంబరు 31: కేంద్రంలోని మోదీ నియంతృత్వ పాలన సాగిస్తున్నారని, బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపడమే లక్ష్యంగా కమ్యూనిస్టులు పోరాటాలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కేసముద్రంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కమ్యూనిస్టులు బలపడి నూతన సమాజాన్ని ఆవిష్కరించాలని అన్నారు. జిల్లా నాయకులు మార్తినేని పాపారావు, చాగంటి కిషన్, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, కావటి నర్సయ్య, శ్రీశైలం, జల్లె జయరాజ్, గొడిశాల వెంకన్న, జాటోత్ వెంకన్న, బాలునాయక్ పాల్గొన్నారు.

సామాజిక చైతన్య రచనలతోనే కవులకు గుర్తింపు

▸▸ విద్యావేత్త డాక్టర్ డోలి సత్యనారాయణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ డోలి సత్యనారాయణ, కవులు, రచయితలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 31 : సామాజిక సమస్యలపై నిరంతరం పోరాడుతూ.. విమర్శనాత్మక దృష్టితో రచనలు చేసేవారే ఉత్తమ కవులు, రచయితలుగా గుర్తింపు పొందుతారని, అటువంటి వారికే సమాజంలో గౌరవం లభిస్తుందని ప్రముఖ విద్యావేత్త, నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్ నలంద డిగ్రీ కళాశాలలో ఆదివారం బహుజన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత సీతారాములు రచించిన 'సంక్షోభం నుంచి సంక్షేమ బాట' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... గత నాలుగు దశాబ్దాలుగా సామాజిక చైతన్యంతో కూడిన రచనలు చేస్తున్న రచయిత కోమాకుల సీతారాములు అని చెప్పారు. ప్రస్తుతం సామాజిక చైతన్యంతో కూడిన రచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ రచయిత సయ్యద్ ఖుర్షీద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు బి.వీరన్న, మద్దెర్ల రమేష్, కొమిరె వెంకన్న, టి.వెంకట్రాంనర్సయ్య, బండారు శ్రీనివాసరావు, వెంకన్న, ఇమామ్, రాజు, రాజేందర్, రహిమొద్దీన్ పాల్గొన్నారు.